పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి


సరూర్‌నగర్ గౌడ సంఘం ఆవరణలోని పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బేర బాలకిషన్, అరవింద్‌కుమార్‌గౌడ్, ధన్‌రాజ్, ప్రవీణ్


మలక్‌పేటలో పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్


పాపన్నకు నివాళులర్పిస్తున్న కిరణ్‌గౌడ్, తదితరులు


పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, వేములయ్య గౌడ్

» బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సుకు కృషి చేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గౌడ సంఘాల జేఏసీ కో కన్వీనర్ కూరెళ్ల వేములయ్య గౌడ్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పల్లవి గార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవలు మరువలేనివన్నారు. యువత పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకుని హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్ గౌడ్,మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్ రావు గౌడ్, మిద్దెల మల్లేశం గౌడ్, కట్ల నర్సింహయాదవ్, కనకాల శ్యామ్ కుర్మ, ఇరిగి రమేష్ పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ గౌడ సంఘం ఆవరణలోని పాపన్న విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్న మహరాజ్ 314వ వర్ధంతిని ఆత్మబలిదాన దినోత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆత్మగౌరవ పతాకం సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, సరూర్‌నగర్ గౌడ సంఘం నాయకులు బాలాగౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, కబీర్‌దాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సరూర్‌నగర్ : మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందచెరువు కట్టపై గల పాపన్న విగ్రహం వద్ద మంగళవారం వేడుకలు నిర్వహించారు. పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లెలగూడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొబ్బిలి కిరణ్‌గౌడ్, నాయకులు కుంటల భిక్షపతిగౌడ్, అనిల్‌గౌడ్, సుర్వి మహేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, యాదగిరిగౌడ్, రాహుల్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ఏఆర్ కానిస్టేబుల్ వసూళ్లు

» ప్రభుత్వ ఉద్యోగులకు బెదిరింపులు

» అతడితో పాటు సహకరించిన మెకానిక్ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌ను, అతనికి సహకరిస్తున్న ఓ టీవీ మెకానిక్‌ను ఎల్బీనగర్ ఎస్ఓటీ, చైతన్యపురి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్మన్‌ఘాట్, క్రాంతినగర్‌లో నివసించే ఎ.మల్లేశ్ అలియాస్ మూర్తి (38) మహబూబ్‌నగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. కొద్దికాలం క్రితం నాగర్‌కర్నూల్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. తనకు పరిచయస్థుడైన చింతలకుంటకు చెందిన టీవీ మెకానిక్ రాపోలు అనిల్‌కుమార్ అలియాస్ అనిల్ (28)తో కలిసి సులువుగా డబ్బు సంపాదించడం కోసం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ అవతారమెత్తాడు. ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగుల వివరాలతో ఒక లిస్ట్ తయారు చేశాడు. వారిని టార్గెట్ చేసి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. అనిల్ ఫోన్ ద్వారా వారిని బెదిరించేవాడు. పే అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ట్రెజరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొత్తపేటకు చెందిన కె.సుధీర్‌బాబుకు మార్చి 6న ఫోన్ చేశాడు. అవినీతికి పాల్పడుతున్నావంటూ ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయని బెదిరించాడు. దాడి చేయకుండా ఉండాలంటే లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీని గురించి మాట్లాడేందుకు బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఏసీబీ కార్యాలయం రోడ్డు వద్దకు రావాలని సూచించాడు.

పోలీసులను ఆశ్రయించడంతో ఆటకట్టు..!

తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తనను బెదిరిస్తున్న మల్లేష్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సుధీర్‌బాబు చైతన్యపురి పోలీసులను ఆశ్రయించాడు. కాల్‌డేటా ఆధారంగా అనిల్, మల్లేష్‌పై చైతన్యపురి పోలీసులు, ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు నిఘా పెట్టారు. అనిల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఏఆర్ కానిస్టేబుల్ మల్లేష్ సూత్రధారిగా తేలింది. దీంతో పోలీసులు మంగళవారం కానిస్టేబుల్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎనిమిదిమంది వద్ద డబ్బు వసూలు..

నిందితులు మల్లేష్, అనిల్‌ను విచారించగా గతంలో ఎనిమిదిమంది ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి సుమారు రూ.3.40 లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తేలింది. వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప నుంచి రూ.లక్ష, డీఎస్పీ ఇమ్మానుయల్ నుంచి రూ.8 వేలు, ఆర్ఐ వీరేష్ నుంచి రూ.65 వేలు, ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య నుంచి రూ.5 వేలు, అనిల్, రామ్‌లాల్, సౌమిత్రి నుంచి రూ.5 వేలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుల వద్ద రెండు మొబైళ్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి

హఫీజ్‌బాబానగర్‌లో ఫ్లాగ్‌మార్చ్

చంపాపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్, వివిధ ప్రాంతాల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రజక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ

తారామతిపేటలో రజక సంఘం సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలో మంగళవారం బండారి బాలయ్య అధ్యక్షతన రజక సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఉన్న రజకుల, రజక వృత్తిదారుల సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రజక జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, ఫెడరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు, ఆన్‌లైన్‌లో చేసుకున్న రజక సహకార సంఘాలకు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు బండారి ముత్యాలు, సంఘం ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్, వేముల కృష్ణ, చిన్న రాములు, పెంటయ్య, వీరయ్య, అంజయ్య, సత్తయ్య, నర్సింహ, విక్రమ్, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో బ్రోచర్ ఆవిష్కరణ

చంపాపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో మంగళవారం రాష్ట్రీయ వానర సేన ఆధ్వర్యంలో సీతమ్మకు చింతాకు పతక సేవ కార్యక్రమం బ్రోచర్‌ను వీహెచ్‌పీ నేత నాం రాంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 17న రాష్ట్రంలోని అనేక దేవాలయాల్లో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని చింతాకు పతకములు అందించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అయోధ్య నుంచి పూజలు చేయించి తీసుకొచ్చిన చింతాకు పతకములను నవమి రోజులు ఆలయాలకు అందిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు ఈ మహత్కార్యంలో భాగస్వాములయ్యేందుకు 11 రూపాయలు చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు వానర సేన భక్తులు పాల్గొన్నారు.

‘అయ్యో’మయం!

(5వ పేజీ తరువాయి)

నగరంలో బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ ‘ఆపరేషన్ ఆకర్ష్’కు తెరలేపింది. పార్టీ మారుతారంటూ నగరానికి చెందిన పలువురు గులాబీ శాసనసభ్యుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మేం బీఆర్ఎస్‌ను వీడేది లేదని ఎమ్మెల్యేలు చెబుతున్నా..ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న అనుమానం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన పూర్వాశ్రమం కాంగ్రెస్‌లో తిరిగి చేరుతారని ప్రచారం జరుగతున్న వేళ.. నియోజకవర్గ హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేటలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర నిర్వహించడం గమనార్హం. ఈ సమయంలో పార్టీ మారుతారని ప్రచారం జరగడంతో దీంతో పార్టీలో ఉంటారా ? వెళ్తారా ? అని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన వేళ ఇలాంటి పరిస్థితి ప్రభావం చూపుతుందని సీనియర్ నేతలు అభిప్రాయ పడుతున్నారు.

దేశ ప్రజలను కాంగ్రెస్ మేనిఫెస్టో ఆకట్టుకుంటోంది

» టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్


సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రంగారెడ్డితో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

ఎల్బీనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరినీ ఆకట్టుకునేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఉండనుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఈ నెల 6న తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ వద్ద నిర్వహించనున్న జనజాతర బహిరంగసభ ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్, ప్రియాంకాగాంధీ పాల్గొననున్న సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిగా పార్టీ కార్యకర్తలు, ప్రజలు హాజరుకానున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇదే తుక్కుగూడలో విడుదల చేసిన ఆరు గ్యారెంటీల మేనిఫెస్టో ప్రజలను ఆకట్టుకుందని దీంతో ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసి గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే అయిదు గ్యారెంటీలను అమలు చేసిందని చెప్పారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారెంటీలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాపీ కొట్టే ప్రయత్నం చేస్తుందని అన్నారు. సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌ఛార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టాలి

» ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి


అండర్ గ్రౌండ్ ఓపెన్ డ్రైన్స్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని అండర్ గ్రౌండ్ ఓపెన్ డ్రైన్స్ పనులు చేపట్టాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌కు వెళ్లే రోడ్డులో విజయవాడ జాతీయ రహదారి వద్ద నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ ఓపెన్ డ్రైన్స్ పనులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా రెండు ఫీట్ల పైపులైన్స్ వేయాలని అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో పెద్ద, పెద్ద బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండడంతో డ్రైనేజీ సమస్యలు రాకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలనీ చీఫ్ ఇంజనీర్ గణపతి రెడ్డికి ఎమ్మెల్యే ఫోన్‌లో సూచించారు. వరదనీటి కాలువ వెడల్పు రెండు మీటర్లు ఉండాలనీ, మ్యాన్ హోల్స్ సైజులు పెంచి, వచ్చే వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డ్రైన్స్ పనులు పరిశీలించడానికి వచ్చిన జీహెచ్ఎంసీ అధికారి ధర్మారెడ్డిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీశ్ యాదవ్, ప్రవీణ్ ముదిరాజ్, విజయ్‌భాస్కర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, ఆనంద్ కుమార్, ధన్‌పాల్, శ్రవణ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆటిజం పిల్లలకు పౌష్టికాహారం కీలకం

» సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.వెంకటేష్


మాట్లాడుతున్న ఐసీఎంఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.వెంకటేష్

కొత్తపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆటిజం పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పౌష్టికాహారం కీలకపాత్ర పోషిస్తుందని ఐసీఎంఆర్, జాతీయ పౌష్టికాహారం సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.వెంకటేష్ అన్నారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తపేట మోహన్‌నగర్‌లోని చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ ‘మానస’లో ఆటిజం- పౌష్టికాహార దృక్పథంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. నిపుణుల సూచనల ఆధారంగా క్రమం తప్పకుండా పోషకాలున్న ఆహారం అందించాలని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం కోసం స్విమ్మింగ్, సైక్లింగ్, రన్నింగ్ లాంటి వ్యాయామ అంశాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. మాగ్మా ఇంజనీరింగ్ ఇండియా ప్రై.లి. ఐఎం శ్రీకాంత్ ఎస్ఎస్ అడ్డాల న్యూరో డెవలప్‌మెంటల్ క్లినిక్‌లో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీల్లో వాడే పరికరాలను, రూ 5 లక్షలను విరాళంగా అందజేశారు. దివ్యాంగ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డా.సెల్వియా ఫెర్నాండెజ్ రావు, మాగ్మా అసోసియేట్ మేనేజర్ జీ.రాధాకృష్ణ, మానస డైరెక్టర్ మెర్సీ మధురిమ, ప్రిన్సిపాల్ లింగాల లక్ష్మి, విద్యార్థు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

చంపాపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని హలాక్‌కాలనీలో సోమవారం రాత్రి ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో కార్పొరేటర్ సుజాతనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తుండటం హర్షనీయమని అన్నారు. విందులో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



ముగింపు ఉత్సవంలో డీఆర్‌డీఎల్ పీడీ శంకరి, జేఎన్‌టీయూ పరీక్షల అదనపు కంట్రోలర్ డాక్టర్ శైలజ

ముగిసిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం

సైదాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్ నగర్‌లోని భోజిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం జిజ్ఞాస-2024 మంగళవారం ముగిసింది. వివిధ రాష్ట్రాల నుంచి 1073 మంది ఔత్సాహిక విద్యార్థులు హాజరై ఆవిష్కరణలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథులుగా డీఆర్‌డీఎల్ ఏఎస్ఎల్ ప్రాజెక్టు డైరక్టర్ ఎస్.శంకరి, జేఎన్‌టీయూ పరీక్షల అదనపు కంట్రోలర్ డాక్టర్ శైలజ హాజరయ్యారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవన్, సెక్రటరీ సుధ, సీఓఓ డాక్టర్ సుజాత గంగాధర్, కన్వీనర్ మంజుభార్గవి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

అభ్యర్థిని గెలిపించుకుందాం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భువనగిరి లోక్‌సభ ఎన్నికల బరిలో సీపీఎం అభ్యర్థి పోటీలో ఉంటాడని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్పష్టం చేశారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామ పరిధిలోని సితార గెస్ట్‌హౌజ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్టీ క్యాడర్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలన్నారు. సమావేశంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగల భాస్కర్, కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య, బోడ సామేల్, చంద్రమోహన్, కవిత, జగదీష్, నర్సింహ, రాంచందర్, జగన్, జంగయ్య, శ్యాంసుందర్, నర్సింహ, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, రవికుమార్, ఏర్పుల నర్సింహ పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో చలివేంద్రం ప్రారంభం

సరూర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ ప్రధాన చౌరస్తాలో లైఫ్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, లైఫ్ హెల్త్ నిర్వాహకులు మహేశ్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

భయం భయంగా ఆస్పత్రిలోకి పరుగులు

● భవనంపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య



రితీష్‌రెడ్డి (ఫైల్)

కొత్తపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి భవనంపై నుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఎల్బీనగర్ పీఎస్ పరిధి చోటుచేసుకుంది. వనస్థలిపురం, ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన గుమ్మడి రితీష్‌రెడ్డి (28) కారులో ఎన్‌టీఆర్‌నగర్‌కు వచ్చాడు. అక్కడ కారు దిగి ఎవరో వెంటాడుతున్నట్లుగా భయం భయంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోకి వెళ్లాడు. ఎక్కడికి వెళుతున్నావని సెక్యూరిటీ సిబ్బంది ఆపే యత్నం చేయగా, అటెండర్‌ను కలవాలంటూ భవనం మూడో అంతస్తుకు చేరుకున్నాడు. ఆస్పత్రి సిబ్బంది అతడిని ఆపేందుకు ప్రయత్నించినా కిటికీలో నుంచి కిందకు దూకాడు. తలకు గాయాలైన అతడ్ని పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్టు గుర్తించారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని ఎల్బీనగర్ పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు రిధంరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భవతి కిడ్నీలు ఫెయిల్

సంతోష్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈదిబజార్‌కు చెందిన ఓ గర్భవతి (23) డెలివరీ కోసం స్థానిక కుమ్మరివాడిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. రక్తం తక్కువగా ఉండటంతో డాక్టర్ సరళ తెల్ల రక్తకణాలు ఎక్కించినట్లు ఆమె భర్త ఇమ్రాన్ తెలిపారు. కొద్దిసేపటి తర్వాత తన భార్య ఆరోగ్యం క్షీణించిందని, మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి డయాలసిస్ చేయించాలని వైద్యులు తెలిపారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని ఆరోపిస్తూ ఇమ్రాన్ సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పోలింగ్ సిబ్బందికి శిక్షణ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హైదరాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలోని మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ విధులు నిర్వహించనున్న సిబ్బందికి గురువారం శిక్షణ ఇవ్వనున్నారు. మలక్‌పేట ముంతాజ్ కళాశాలలో దాదాపు 660 మంది పోలింగ్ సిబ్బంది, మరో 90 మంది మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ విధులపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్నికల నోడల్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రెండో విడతలో మరో నాలుగు వందల మంది పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. మలక్‌పేట ఏఆర్‌వోలు రాజేష్‌కుమార్, జయశ్రీ పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం మొదటి విడతలో నాలుగు వందల మంది పీవోలు, ఏపీవోలకు, మంగళవారం రెండో విడత శిక్షణలో మరో నాలుగు వందల మంది పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు వందల పోలింగ్ బూత్‌లకు గాను నాలుగు వందల మంది పీవోలు, మరో నాలుగు వందల ఏపీవోలను నియమించారు.

ఆస్తిపన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

సరూర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నూతన ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30లోగా చెల్లించే వినియోగదారులకు ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించిందని బడంగ్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ జి.రఘు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తిపన్నును ముందస్తుగా చెల్లించాలని ఆయన కోరారు. గత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ చెల్లింపుపై 90 శాతం రాయితీ వర్తింపజేశామని, ఈ ఏడాది తాజా పన్నుపై ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

చంపాపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానం అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి కోరారు. ఆలయంలో శ్రీ ధ్యానాంజనేయస్వామి దర్శనం కోసం లైన్‌లో విచ్చేసే భక్తులు వర్షం, ఎండ దాటిని తట్టుకునేందుకు రెడ్డి బ్రదర్స్ అధినేత డి.ప్రకాష్‌రెడ్డి సహకారంతో నిర్మించిన షెడ్డును మంగళవారం ధర్మకర్తలతో కలిసి చైర్మన్ పరిశీలించారు. అనంతరం షెడ్డు నిర్మాణ దాత డి.ప్రకాష్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులను చైర్మన్, ధర్మకర్తలు ఘనంగా సన్మానించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్ గౌడ్, మేకల యాదగిరి, అంజిరెడ్డి, చేగోని సురేష్‌గౌడ్, చీర తిరుమలేష్, బీసు కుంట్ల సతీష్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ శ్రీరామలింగేశ్వర కాలనీలో అభివృద్ధి పనులతో పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కాలనీ రోడ్ నెం.3,4లో పర్యటించారు. ఇటీవల ఈ దారుల్లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ పనులు చేపట్టి మట్టితో కప్పేశారని, దీంతో రహదారులు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుధాకర్, ప్రతినిధులు యాదయ్య, ఈశ్వర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదంలో హత్యాయత్నం చేసిన నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు. ఆస్తి వివాదంలో తన భర్త 2016 డిసెంబర్ 4న తమ ఇంటికి వచ్చి వాగ్వాదానికి దిగి కత్తితో తన తల్లిపై దాడి చేశాడని నాగోల్‌కు చెందిన జయశ్రీ చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు శ్రీనివాస్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

‘నరసింహ’ ఆలయంలో బ్రహ్మోత్సవాలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ గాయత్రీనగర్‌లోని శారదా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రారంభమైన షష్ఠమ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పరమపూజ్య శ్రీప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ చల్లా కవితాబాల్‌రెడ్డి, ఆలయ సీఈవో డాక్టర్ బీఎస్ రవిశంకర్, అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజేశ్వర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, హరిబాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.